ఆత్మోదాహరణము

(ఉదాహరణ కావ్యము)

(నిత్య నిర్గుణ చైతన్య ప్రశంసాత్మకము)



రచన

నారుమంచి వేంకట అనంత కృష్ణ

ఆత్మోదాహరణము

(ఉదాహరణ కావ్యము)

(నిత్య నిర్గుణ చైతన్య ప్రశంసాత్మకము)



రచన

నారుమంచి వేంకట అనంత కృష్ణ

ఆత్మోదాహరణము
(నిత్య నిర్గుణ చైతన్య ప్రశంసాత్మకము)

నారుమంచి వేంకట అనంత కృష్ణ

ప్రథమ ముద్రణ : క్రోధి, ఆశ్వయుజం. అక్టోబర్ 2024

వెల : అమూల్యము

ప్రతులకు సంప్రదించండి :

N.V.Anantha Krishna
Advocate,
Plot No.80, Sri Sai Nagar, Road No.4
Opp.Sri Saibaba Temple, Nagole Post,
Hyderabad 500 068.

Mobile:9246531895
Email: ananthcourt@rediffmail.com

జై కృష్ణానంద　　　　సదానందో విజయతే　　　　జై మాధవానంద

శ్రీ మదనానందో విజయతే తరామ్

శ్రీ గురుమదనానంద సరస్వతీ పీఠము

Sri Guru Madanananda Saraswathy Peethamu

రాంపురం, తొగుట మం. సిద్దిపేట జిల్లా, పిన్ : 502 372.

Rampuram, Toguta Mandal, Siddipet District. PIN: 502 372.

రంగంపేట, కొల్చారం, మం. మెదక్ జిల్లా, పిన్ : 502 381.

Rangampet Village, Kulcharam Mandal, Medak District, PIN: 502 381.

సాధనాత్ సాధ్యతే సర్వమ్

"Saadhanath Sadhyate Sarvam"

శ్రీ శ్రీ శ్రీ జగద్గురు ఆదిశంకర పరబ్రహ్మణే నమః

శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్య శ్రీ సరస్వతీ పీఠ సకల నివాస భక్త మనోరథ కల్పద్రుమ సదోదిత ఆనందదాయక శ్రీ గురు సచ్చిదానంద యోగీంద్ర మకుట మార్తాండాది ప్రచండ నిర్వైద సద్వైధ నిర్వికల్ప నిరాకార నిత్యశుద్ధ కరుణార్ణవ పరిపూర్ణ శ్రీమదఖిల కళ్యాణ పీఠ విరాజిత సదానంద గంభీరానంద మాధవానంద కరకమల సంజాత శ్రీ గురు మదనానంద సరస్వతీ పీఠ మూల పురుష **శ్రీశ్రీశ్రీ మదనానంద సరస్వతీ స్వామి** కరకమల సంజాత మహంత పద్మవిభూషణ బిరుదాలంకృత శ్రీ గురు మదనానంద సరస్వతీ పీఠ వ్యవస్థాపక పీఠాధీశ్వర **శ్రీశ్రీశ్రీ కృష్ణానంద సరస్వతీ స్వామి** కరకమల సంజాత శ్రీ గురు మదనానంద సరస్వతీ పీఠాధీశ్వర **శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతీ స్వామి** వారి మహా సన్నిధానము

తేది:- 02-09-2024

ఆనందాక్షరాశీః

అఖండాద్వయానందాన్ని ఏ ఒక్క రీతిలో వ్యక్తపరచే విధానం లేక 'రస' మని, **'ఆత్మ'** అని ఏదో ఓ మాటలో అంటుంటాం. నిర్వికారమైన ఆ పదార్థాన్ని ఏ పదాలతో వర్ణించలేము. కానీ పదే పదే ఆ ప్రయత్నం చేస్తూ చేస్తూ ఎంతో కొంత అనుభూతి పొందుతుంటాము. **శ్రీ నారుమంచి వేంకట అనంతకృష్ణ** గారు అనంతమైన అంశాన్ని ఉదాహరణ కావ్యంగా అందరిలో నాటుకునే విధంగా చక్కటి పదాలను ఛందోబద్ధంగా మలచి మంచి **"నారును"** వేసిన మంచి వారయ్యారు.

"ఆత్మోదాహరణ కావ్యం" ఏదో ఉదాహరణ (Example) గా కాకుండా జీవన రణరంగంలోని యోధులను ఉత్తీర్ణులను గావించే విధంగా తమ అనుగ్రహాశీస్సులనందించాలని మా పరమగురువరేణ్యులు **శ్రీశ్రీశ్రీ మదనానందసరస్వతీస్వామివారిని**, మా గురువరేణ్యులు **శ్రీశ్రీశ్రీ కృష్ణానందసరస్వతీస్వామివారిని** నారాయణ స్మరణ పూర్వకంగా అర్థిస్తున్నాను.

శ్రీవారి ఆజ్ఞతో

రావికోటి సోమశేఖరశర్మ

ధర్మాధికారి (పక్షాన)

ఉదాహరణకావ్య స్వరూపము, ఛందోలక్షణాలు

ఉదాహరణ కావ్యము తెలుగు సాహిత్యములో ఒక ప్రత్యేక శాఖగా పరిగణించబడి విశేషాదరణలు పొందినది. పద్యముతో పాటుగా దేశీ ఛందస్సులో ఉండి గానయోగ్యముగా కూడా ఉండుట దీని ప్రత్యేకత. పరిమాణము చిన్నదైనా వైవిధ్యములో గొప్పది.

అసలు దీనిని ఉదాహరణ కావ్యం అని ఎందుకన్నారా అని ఆలోచిస్తే ఉత్+ఆహరణ ఉదాహరణ అవుతుందనిపించింది. ఉత్కృష్టమైన సమకూర్పు అని కదా. అవును నిజమే ఒక కర్త ప్రపంచముతో సంబంధము కలుగజేసేవి కర్మ, కరణము ఇత్యాది కారకములు. ఈ కారకనిర్దిష్ట విభక్తులు భాషాప్రయోగములో వాడుకుంటాం. అవి లేకపోతే ప్రపంచముతో సంబంధము లేదు. ఇక్కడ కవి తన సర్వకారకాలను తనని కూడా కావ్యవస్తుపరము సంపూర్ణముగా ఆహరణ చేస్తున్నాడు కదా అనిపించింది.

ఉదాహరణ కావ్యము యొక్క లక్షణాలు సంక్షిప్తముగా చెప్పుకుందాం. భాషలో ఏడు విభక్తులు ఉంటాయి. అదికాక సంబోధన ప్రథమ ఒకటి. మొత్తం ఎనిమిది విభక్తులుంటాయి కదా. ప్రతి విభక్తికి ఒక వృత్తపద్యము, ఒక కళిక, ఒక ఉత్కళిక ఉంటాయి. ఇవి కాక ఒక సార్వవిభక్తిక పద్యము, కవికృతనామాంకిత పద్యము కూడా ఉంటాయి. అంటే ఎనిమిది మూళ్ళు ఇరవైనాలుగు పద్యాలు, సార్వవిభక్తిక, నామాంకితపద్యములు రెండు వెరసి 26 పద్యాల

విశేషకావ్యము. ఇది పరమేశ్వరుని ఇరువది ఆరు తత్త్వాలకు ప్రతీక అని పెద్దలంటారు. కొందరు ప్రార్థనాపద్యముగా ఆరంభములో వ్రాసి మొత్తం 27 పద్యాలు చేస్తారు. అది ఆవశ్యకముగానీ, దోషముకానీ కాదు. కవికి స్వేచ్ఛ.

ఇక ఛందస్సు గురించి చెప్పుకుందాం. వృత్తపద్యములు ఉత్పలమాల, చంపకమాల, మత్తేభము, శార్దూలములలోనే వ్రాయాలి. ఈ పద్యములు ఆయా విభక్తులలో చెప్పాలి. కళిక, ఉత్కళిక అన్నది ఉదాహరణకావ్యములో వాడే రగడ అనే దేశీ ఛందస్సులకు పేరు. రగడలు అనేకం. ఏ రగడనైనా వాడవచ్చు కానీ దానికి ఇక్కడ ప్రక్రియలో కళిక అని పేరు. అందుకే కళిక అని వ్రాసి రగడపేరు కుండలీకరణతో వ్రాస్తారు తెలియడానికి. కళికలో సగభాగమును ఉత్కళిక అంటారు. కళికకు వాడిన రగడలో సగం ఉత్కళికకు వాడాలి అని కొందరి అభిప్రాయము. కానీ పూర్వకవుల ప్రయోగములో ఈ నియమము నియతమైనట్లు కనబడదు. తాత్పర్యమేమిటంటే కళిక ఉత్కళిక ఒకే రగడలో ఉండాలన్న నియమము తప్పక పాటించ పనిలేదు. కానీ ఇతర లక్షణములు మాత్రము తప్పక పాటించాలి. కనీసం కళికలోని మాత్రా నియమాన్ని అనుసరించి తత్సంబంధ రగడలో సగం వినియోగించవచ్చు. ఇవి రెండూ కూడా కనీసం ఎనిమిది పాదాలు ఉండాలి. ఎక్కువ కూడా ఉండవచ్చు కానీ తగ్గకూడదు. ఈ రగడల విషయములో మరిన్ని వివరాలు క్రింద చూడవచ్చు.

కళికలలో ప్రతిపాదాంతములో సంబోధనతో సహా ఆయావిభక్తిప్రత్యయాలు వచ్చితీరాలి. చతుర్థీవిభక్తి విషయములో విభక్తి ప్రత్యయము ఆభాస ఉన్నా కూడా సరిపోతుంది. ఉత్కళికలో చివరి రెండు పాదాలలో విభక్తిప్రత్యయము వచ్చితీరాలి. కళికలో ప్రతిపాదము స్వతంత్రవాక్యముగా ఉండవలెను. ఉత్కళికలో ఏకసమాసముగా పాదములుండాలి.

సార్వవిభక్తికములో అన్ని విభక్తులు(8) ప్రయోగించాలి. నామాంకిత పద్యములో కవి పేరు, కావ్యము పేరు కూడా రావాలి. వీటికి కళిక, ఉత్కళికలు ఉండవు.

ఇక రగడల గురించి వివరాలు. ఇది మాత్రాఛందస్సులో ఉంటుంది. ఒక లఘువును ఒక మాత్రగా, ఒక గురువుని రెండు మాత్రలుగా చెప్పుకుందాం. అంటే భగణము UII, జగణము IUI, సగణము IIU, గగము UU, నలము IIII అని కాక ఇవన్నీ కూడా నాలుగుమాత్రల గణము అంటారన్నమాట. ఇక రగడల విషయములో మూడు, నాలుగు, ఐదు మాత్రల గణాలు మాత్రమే వినియోగిస్తారు. వీటినే త్రిమాత్రాగణములు, చతుర్మాత్రాగణములు, పంచమాత్రాగణములు అని కూడా అంటారు.

త్రిమాత్రా గణములు – UI, III, IU అయినా UI, III మాత్రమే ప్రయోగించవచ్చు. IU ఇది వినియోగించరాదు.

చతుర్మాత్రాగణములు - భగణము UII, సగణము IIU, గగము UU, నలము IIII, జగణము IUI, అయినా భగణము UII, సగణము IIU, గగము UU, నలము IIII మాత్రమే ప్రయోగించవచ్చు. జగణము IUI వినియోగించరాదు.

పంచమాత్రాగణములు – తగణము UUI , రగణము UIU , నగ గణము IIIU, సల గణముIIUI , భల గణము UIII, నలల IIIII గణము , యగణము IUU, జల గణము IUII అయినా, యగణము IUU, జల గణము IUII వినియోగించరాదు.

ప్రతి రగడలో రెండుపాదములుంటాయి. ఆదిప్రాస, అంత్యప్రాస రెండు కూడా నియమముగా పాటించాలి. యతి నియమము కలదు. కానీ ప్రాసయతి నిషిద్ధము. రగడలకు గతి, తాళము నియమితము చేయబడినవి (ఇది పాడునప్పుడు ఉపయుక్తమైన అంశము. రచనాకాలమునకు కాదు). రెండుపాదములు ఒక రగడ అన్నాము కదా. వరుసగా 8 పాదములు వ్రాసినప్పుడు ప్రతి రెండు పాదములకు స్వతంత్రమైన రగడ కనుక వేరువేరు యతిప్రాసలు ఉండవచ్చును. ఏకప్రాస పాటించుట సౌందర్యము కొరకు కవి స్వేచ్ఛయేకానీ నియమము మాత్రము కాదు.

రగడ పేరు	ప్రతి గణమునకు మాత్రలు	పాదమునకు గణములు	యతి స్థానము గణము,అక్షరము
హయప్రచార	3	4	3 గ, 1 అ
తురగవల్గన	3	8	5 గ, 1 అ
విజయమంగళ	3	16	5 గ. 1 అ అలాగే 9 గ, 1 అ మరియు 13 గ, 1 అ
మధురగతి	4	4	3 గ, 1 అ
హరిగతి	4	8	5 గ, 1 అ
ద్విరదగతి	5	4	3 గ, 1 అ
విజయభద్ర	5	8	3 గ, 1 అ అలాగే 5 గ, 1 అ అలాగే 7 గ , 1 అ
హరిణగతి	3+4 (7 మాత్రలు)	2	3గ, 1 అ
వృషభగతి	3+4(7 మాత్రలు)	4	5 గ, 1 అ

ఉత్కళిక - కళికలో సగము ఉత్కళిక ఉదాహరణకు హయప్రచార రగడలో త్రిమాత్రాగణములు నాలుగు ఉన్నవి. దాని ఉత్కళికలో త్రిమాత్రాగణములు రెండు మాత్రమే ఉంటాయి. కళికలో

యతినియమము కలదు కానీ ఉత్కళికలో యతి నియమము లేదు. మిగిలిన మాత్రాగణవివరములు సమానము.

రగడలకు సంగీతశాస్త్రము ప్రకారము గతి, తాళము నియమితము అనుకున్నాము కదా. వాటి వివరాలు కూడా తెలుసుకుందాం.

మాత్రల సంఖ్య	గతి	తాళము
3	తిస్రగతి	రూపక
4	చతురస్రగతి	ఏక
5	ఖండగతి	ఝంపె
3+4	మిశ్రగతి	త్రిపుట

ఈ రగడలు పై నియమాల ప్రకారము మాత్రమే పాడాలని పెద్దల మాట.

★★★

మనసు గుసగుసలు

ఉదాహరణ కావ్యం వ్రాయడం కేవలం పరమాత్మ సంకల్పము. కావ్యలక్షణజ్ఞానము లేదు. మిత్రుల సహకారముతో లక్షణములు తెలిసికొన్నను, మొదటిసారిగా విన్న పేర్లు కళిక, ఉత్కళిక. వాని లక్షణము అవగతము చేసుకోవాలి. పదముల పేర్పుకాక లయాత్మకముగా సాగాలన్న నియమముతో మరింత కాఠిన్యము తోచినది. సంబోధనప్రథమతో కలిపి 8 విభక్తులు, ఒకొక్క విభక్తికి పద్యము, కళిక ఉత్కళిక అనగా 24, సార్వవిభక్తికము ఒకటి అంకితపద్యము ఒకటి వెరసి కేవలము 26 అంశములే కావ్యమా? కనీసం ఖండకావ్యమని కూడా అనలేదు, సమగ్రముగా కావ్యమనియే అంటున్నామే? ఇలా మొదలైయ్యింది ఈ కావ్యరచనలో పలు సంశయాలతో నా ప్రయాణం.

26 సంఖ్య పైన దృష్టి పడింది. సాంఖ్యము చెప్పిన మూలప్రకృతి నుండి మహదహంకారములు, దశేంద్రియాలు, తన్మాత్రలు, మనస్సు, పంచమహాభూతములు వెరసి 24 తత్త్వములు. విభక్తులకు వ్రాయవలసినవి 24 అంశములు. జీవాత్మ ఒకటి 25వ అంశము సార్వవిభక్తికము అనుకుందామంటే మరి 26వది అంకితాంకితపద్యము దేనికి అన్వయము? యోగ దర్శనములో చెప్పిన ఈశ్వరస్థానీయముగా సమాధానం చెప్పుకున్నాను. అంటే ఈ 26 అంశాలు ఈశ్వరచైతన్య సహితముగా సమస్తప్రపంచ సూచకమనిపించింది. నిజమో కాదో కానీ ఆనందం మాత్రం అనుభూతమైనది.

సంఖ్యలకు అన్వయం సాధించాననుకుంటే వెంటనే మనసు మరొక ప్రశ్న సంధించింది. ఏవో 26 పద్యాలు వ్రాయవచ్చుగా, విభక్తులలో బిగింపు దేనికి? కొత్తదనము కోసమా? 26 తత్త్వాల ప్రపంచం తో అన్వయిస్తే విభక్తులు దేనిని సూచిస్తున్నాయి అన్నది మరొక ప్రశ్న. కావ్యరచనకన్నా నామౌచిత్యం మీదనుండి దృష్టి మరలకున్నది. ఇలా విభక్తినిర్దేశములోని ఆంతర్యము వెతుకుటకు మనసు పరుగులు తీసింది.

ప్రపంచముతో మన సంబంధము 'నేను' అనే అహం ప్రత్యయముతో, అదే కర్తృకారకము అనిపించింది. ఇది తెలిసినాక మిగిలినవి అలవోకగా విడిపోయాయి. నేను పొందవలెననుకున్నది కర్మకారకము. ఇలా 'నేను' ప్రపంచములో బంధించబడుతున్నాను. పొందాలన్నది పొందే సాధనము కరణకారకము. దేని కొరకు పొందడం? నాకు కలిగే లౌకికానందం కోసం కదా ఇదంతా. అదే సంప్రదానకారకము. దానిని నేను దేనినుండి పొందుతున్నానో అది అపాదానకారకము. ఇలా 'నేను' ప్రపంచముతో గాఢమైన సంబంధము ఏర్పరుచుకున్నాను. అదే సంబంధషష్ఠి. ఇదంతా ఈ ప్రపంచమునందే సాధ్యము అదే అధికరణకారకము.

కారకము అర్థభావమైతే దానిని వ్యక్తపరిచేది శబ్దము. అదే కారకములకు విభక్తులు. అలాగే తమతమ సాధ్యములను గుర్తించి సంబోధించుటయే సంబోధనప్రథమ. ఇవి విడివిడిగా కనబడవు. నేను చేయు కర్మలో ఒకదానితో ఒకటి పెనవేసుకుని అభిన్నముగా 'నేను,నాది' లో కలిసిపోయిన సార్వవిభక్తికస్థితి. అయితే ఈ లంపటములోనుండి బయటపడాలి. కర్మబంధహేతువులైన విభక్తులను గుర్తించి, జ్ఞానియై సమస్తము ఆ చైతన్యమునకు సమర్పించినప్పుడే ముక్తస్థితి. అదే అహంకారత్యాగ సూచ్యమైన అంకితాంకిత పద్యము. అంకితాంకితపద్యములో కావ్యనామము, రచయితపేరు తప్పనిసరి అన్నారు. అంటే ఈ ఉపాధిపేరు కావ్యనామమైతే, కర్తృత్వ భోక్తృత్వభావాలు రచయితపేరు. ఇవి రెండూ చైతన్యముకన్నా భిన్నము కాదని దానిలో లయం చేయు జ్ఞానభూమిక అన్నమాట. ఉదాహరణ అంటే ఉత్ – ఉత్కృష్టమైన ఆహరణ – భిన్నములను ఒకచోట చేయుట. అదే స్వస్వరూపసందర్శనము. ఇలా ఆలోచించినాక 'కావ్యము' అన్నది చిన్నపేరనిపించింది. ఇది ఆత్మతత్త్వబోధకము. అందుకే నా ఉదాహరణకావ్యం 'ఆత్మోదాహరణము'.

దీనికి ఆశీస్సులందిచిన కనబడే చైతన్యము శ్రీశ్రీశ్రీ మాధవానందసరస్వతీ సంయమీంద్రులకు అనేక ప్రణిపాతములు. అమ్మదయ తప్ప నేను ఈ కృతి చేయుటకు హేతువు వేరు లేదు. వెరసి, నేను ధన్యుడను. అంతా గురుకృప, అమ్మదయ. స్వస్తి.

05.10.2024 **గురుపాదధూళి**

భాగ్యనగరము **నారుమంచి వేంకట అనంతకృష్ణ**

(నిత్య నిర్గుణ చైతన్య ప్రశంసాత్మకము)

ధ్యానము

శా.॥
శ్రీరమ్యాద్భుత నిత్యతత్వమరయన్ చిద్రూప చిచ్ఛక్తియున్
సారాసారసుధీ వివేకమతులై సాక్షిత్వ విజ్ఞానమున్
తీరౌ సృష్టివిలాసయోని ఫలమున్ ద్విత్వంబునేకంబుగా
కారుణ్యంబును చూపమందు దయతో కన్పట్టుమాత్మాఖ్యవై

ఉ.॥

శ్రీకరుడాప్తుడాది తుదిజేరగ జాలననంతుడున్ కనన్
లోకములన్నిటన్ నిలుచు లోకహితైషుడు నిర్మలుండనన్
ప్రాకటభక్తి గొల్చు తరి రాగము ద్వేషము బాపు స్వామియున్
నేకనుగొంటి నెవ్వరని నిత్యుడు తానది యాత్మ తత్త్వమే

కళిక (తురగవల్గన రగడ)

ఆదిమధ్యచివరలేని అసలుతత్త్వమైనయాత్మ
మోదఖేదహీనమైన మోక్షరూప సత్యమాత్మ
మూడుగుణములంటనట్టి మూలతత్త్వమైన యాత్మ
మూడుకాలములను నిండు మూలకాలమైన యాత్మ
చూడచూపు కందనట్టి శుద్ధమైన శక్తి యాత్మ
చీడలన్ని దాటిచూడ చిత్రమైన భావమాత్మ
సత్యమరసి చూచునెడల సకలమందు తానె యాత్మ
నిత్యశుద్ధబుద్ధముక్త నిర్మలమ్ము తానె యాత్మ

ఉత్కళిక

సర్వమావరించినట్టి
నిర్విశేషమైనయట్టి
సకలమందునిండినట్టి
వికలమన్నదెరుగనట్టి
స్థిరము జంగమైనయట్టి
పరమతత్త్వమైనయట్టి
నిత్యమైన సత్యమాత్మ
సత్యమైన తత్త్వమాత్మ

ఆత్మోదాహరణము

ద్వితీయా విభక్తి

ఉ.॥

కారణదేహమాది పలు కార్యములెన్నగ కోశపంచకం
బారయ నింద్రియాదులకు నాకరమౌనట సర్వసృష్టికిన్
మారని యాకసమ్మటు సమష్టియు వ్యష్టియు నావరించుచున్
తీరుగ మాయతోడుత ప్రతీయము నాత్మను గొల్తుభక్తితోన్

కళిక (ద్విరదగతి రగడ)

ధూర్తులౌ మూర్ఖులను దూరముంచెడి దాని
మూర్తిత్రయమ్మునకు మూలభూతపు దాని
తనసాటి మాయతో తగ జగతియౌదాని
ఘన మాయ పాలిటన్ గండ్రగొడ్డలి దాని
భావములు స్తుతియించ భాషకందని దాని
జీవులందరిలోన స్థిరత నుండెడి దాని
వృద్ధిహానియు లేక విఖ్యాతమగు దాని
శుద్ధచైతన్యమై స్ఫూర్తి నింపెడి దాని

ఉత్కళిక

శక్తి కోర శక్తి యగుచు
ముక్తి కోర ముక్తి యగుచు
భక్తి వేడ భక్తి యగుచు
భుక్తి వేడ భుక్తి యగుచు
కోరు కోర్కులన్ని యగుచు
వేరు తాను కాననుచు
వెలితిలేని జీవనమును
నిలిచి యుండు చేతనమును

తృతీయావిభక్తి

ఉ.॥

కానగ కంటి శక్తియగు కాంతులు కల్గెను దేని చేతనో
వీనుల శబ్దసంపుటుల విన్కిడి జ్ఞానపు శక్తిదేనితో
దేనిని గాని దానికొక దీప్తియు ఖ్యాతియు పొందుదేనితో
నా నిజ శక్త్యచేతనములందున నిక్కము యాత్మచేతనే

కళిక (హయప్రచార రగడ)

సుడుల పడని సుఖము చేత
విడని తపన విలువ చేత
కలయజూచు కనుల చేత
తెలియగోరు తెలివి చేత
ధ్యానమైన యార్తిచేత
మౌనమూను మనసు చేత
గురుని దయా గుణము చేత
మరుని బలము మడయు చేత

ఉత్కళిక

శకలమందు
సకలమందు
కనులు కనని
మనసు వినని
తనను తెలుపు
ఘనపు పిలుపు
వినుట చేత
చనుట చేత

చతుర్థీవిభక్తి

ఉ.॥

లోతుగ నెంచి చూచు తరి లోకపు పోకడలాటబొమ్మలౌ
రీతిగ తోచు భోగము మరీచికలట్లుగ భ్రాంతి గొల్పుచున్
ఖ్యాతిగ నింద్రియాదులు సుఖమ్ములు నెమ్మిని గొమ్మనంగ నా
పూత సుబుద్ధి చేర్చునట భోజ్యములన్నియు భోక్త యాత్మకై

కళిక (ద్విరదగతి రగడ)

సత్త్వాది గుణహీన స్వచ్ఛమౌయాత్మకై
తత్త్వాల భేదించి తగజూచు నాత్మకై
విషయ లంపటమన్న వెతలేని యాత్మకై
ఋషిసంఘ హృదయాలకింపైన యాత్మకై
స్వసమానమెన్నని సత్యంపుటాత్మకై
ప్రసవధర్మములేక రాజిల్లెడాత్మకై
దేహరథములనడుపు దేహి రథి యాత్మకై
స్నేహభావముతోడ నిత్యమౌ యాత్మకై

ఉత్కళిక

ముక్తిపొందగనెంచి
శక్తిపూర్తిగనుంచి
నన్ను నేనని మరిచి
నిన్నె నేనని తలచి
సత్యమందున నిల్చి
నిత్యమొక్కటె కొల్చి
స్తుత్యమౌ ప్రాప్తికై
సత్యమౌ దీప్తికై

పంచమీవిభక్తి

ఉ.॥

నెమ్మిని లోకసంగ్రహము నేర్పుగ చేయుచు నాదు చేతలం
జిమ్ముగ మానసమ్మున రహించిన సౌఖ్యము బొందలేడు తా
నెమ్మది నెమ్మదిన్ మిగుల నేర్చి ప్రధానము వీడి నిల్చుచో
నమ్మము కేవలాత్మవలనన్ లభియించు మోక్షమంతటన్

కళిక (తురగవల్గన రగడ)

పెక్కుజన్మలెత్తుటందు ప్రీతి తొలగినందు వలన
మిక్కుటముగ మొక్షమందు మేలునెంచు మనసు వలన
కానవచ్చు జగతినందు కానితనము కనుట వలన
కానరాని తత్త్వమరయ కాంక్ష పెరిగియుంట వలన
మేను నేనె యనెడి బ్రాంతి మేటి ధాటి విడుట వలన
'నేను'యన సమస్తమంచు నిజము తెల్పు గురుని వలన
దేశ కాల వస్తు బద్ధ దేహమనృతమగుట వలన
ఈశశక్తి నిత్యమనెడి ఈప్సితార్థ ఫలము వలన

ఉత్కళిక

సాధనా విశేషమౌచు
బోధనాప్రకాశమౌచు
జలమునందు మునిగినట్లు
విలవిలబడి కలచినట్లు
పరమమైనదొసగమనుచు
గురుని చేరి మొక్కులిడుచు
మిన్ననైన దగుట వలన
నిన్ను తెలియు కోర్కె వలన

ఉ.॥

పెక్కగు జీవజాలములు పెక్కగు స్థావరజంగమాకృతుల్
లెక్కకు మిక్కిలిన్ ప్రజయు లెక్కలకందని భావజాలముల్
చిక్కగ మాయనందున శుచిన్ త్రిగుణాత్మక చేష్టితమ్ములై
దక్కిన వన్నియున్ జడత తత్త్వపుటాత్మకు భిన్నమెన్నగన్

కళిక (మధురగతి రగడ)

ఆద్యంతంబుల నరయని యాత్మకు
విద్యావిద్యల భిన్నపుటాత్మకు
సచ్చిద్రూపపు సత్యపు టాత్మకు
ముచ్చింతలలో మునగని యాత్మకు
మాయను కూడని మహితపు టాత్మకు
పాయకనుండెడి భాకృతి యాత్మకు
జాతాదులలో జతపడనాత్మకు
చైతన్యమ్మౌ సదమలినాత్మకు

ఉత్కళిక

పండగ పుణ్యము
నిండగ హృదయము
పాపములుడుగగ
తాపము తొలగగ
రక్షణ వేడుచు
శిక్షణ కోరుచు
దిక్కని స్థిరునకు
మ్రొక్కగ గురునకు

సప్తమీవిభక్తి

ఉ.॥
మాయను కూడు సృష్టికని మార్పులెరుంగని తాను మారుచున్
చేయుచు లీలలన్నిటిని స్వీయనిజాకృతి కాననీయకే
త్రోయ భవాంబుధిన్ మిగుల దోసము గాంచుచు చిక్కకుండ నే
బాయక నిల్పెదన్ మదిని భాగ్యవశంబున నాత్మయందునన్

కళిక (హయప్రచార రగడ)

సదమలమగు సత్వమందు
హృదయవాస హితమునందు
నిర్మలమగు నిత్యమందు
శర్మమిడెడి సాక్షినందు
దోషపంక్తి దూరమందు
శేషశేషి భావమందు
ధ్యానయోగ్య తత్త్వమందు
నేనెరిగెడి 'నేను' యందు

ఉత్కళిక

భయము తొలగ
జయము కలుగ
కలుగ ప్రాప్తి
వెలుగ దీప్తి
నన్ను మరువ
నిన్ను కొలువ
చేతమందు
చేతలందు

సంబోధనప్రథమావిభక్తి

ఉ.॥

ఆది నెరుంగ మంతమును నారయజాలని నిత్యసత్యమా
ఖేదము మోదమౌనుభయ కీలలు లేని నిరంజనాకృతీ
నాద వినోద ధీనిధి సనాతన నిర్గుణ బుద్ధ తేజమా
నీ దయ వేడికొందు ధృతి నీ నిజమెన్నగ నాత్మతత్త్వమా

కళిక (మధురగతి రగడ)

తెలియదగిన తెలివి రూప
కొలువ పిలుచు కొలది రూప
నిండు మదిని నిలుచురూప
రెండు కాని శ్రీస్వరూప
నిత్యమైన నిజపు రూప
సత్యమైన సత్వరూప
మేనుకాని మేటిరూప
నేనులోని నేను రూప

ఉత్కళిక

పగలు రేయి
వగవు హాయి
గతము భావి
సతము నీవి
జగతి లోన
ప్రగతి లోన
మధుర భావ
సుధయు నీవ

సార్వవిభక్తికం

శా.||
నీవాద్యమ్మువు నిన్ను గొల్తు సతమున్ నీ చే జగాలాయె నీ
కై వేలాదిగ మ్రొక్క నీ వలన నిష్టార్థంబు సిద్ధించె నీ
కే వైరుల్ సఖులో భళా యెటులనూహింపంగ నీయందు నీ
జీవానేకములన్నినిండినవి సచ్చిద్రూపచైతన్యమా

అంకితాంకితపద్యము

ఉ.||
దక్షత లేనివాని గొని ధన్యుగ కౌశికగోత్రజున్ విధిన్
సక్షము నారుమంచి కుల సంభవు చేయుచు విద్యనేర్ప నా
యక్షర జ్ఞానభిక్షగ ననంతుడు వ్రాయగసాహసించె నీ
యక్షయతత్త్వమౌ భవదుదాహరణంబుగ నాత్మతత్త్వమా

⋆ఆత్మోదాహరణకావ్యం సంపూర్ణం ⋆

పరిశిష్టము

ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి

సమస్త చరాచరవస్తుజాలము నిర్గుణ చైతన్యమే. స్వీయ మాయా శబలమై 'స అకామయత' అని సగుణమై అనేకకోటి బ్రహ్మాండములుగా వివర్తమైనది. వివర్తమనగా మార్పు చెందుట. వివర్తమైనది మరల తన నిజస్థితిని పొందగలదు. మట్టి కుండగా వివర్తమై, కుండ తనదైన రూపమునకు ప్రత్యేకమైన నామముతో భాసిల్లి, మరల ధ్వంసమైన పిదప మట్టిగా పరివర్తన చెందుతుంది. మట్టి వివర్తమై కుండ కావచ్చు, కూజా కావచ్చు, బాన, చట్టి ఇలా అనేక రూపాలకు అనేక నామాలు ధరించినా, నిజమునకు వాటియందు సంపూర్ణముగా వ్యాపించి ఉన్నది మట్టి మాత్రమే. కుండ ఇత్యాది సృష్టికి పూర్వమున్న మట్టి, కుండ ఇత్యాదిగా భాసిల్లు సమయములో కూడా కుండ ఇత్యాదిలో సర్వవ్యాపకమై ఉంటుంది. మట్టిలేని తావు కుండ ఇత్యాదులో కనబడదు కదా. అలాగే భిన్నమైన తరువాత మరల మట్టిగా మారుతున్నది. ఇది అనుభవమే కదా.

అలాగే బ్రహ్మము లేక పరమాత్మ లేక చైతన్యము లేక సచ్చిదానందము లేక ఆత్మ అని చెప్పబడే నిర్గుణ చైతన్యము నిత్యమైనది. త్రికాలములలో బాధింపబడనిది.. నిరంజనము, నిరీహము, నిర్వికారము, అనాది, అనంతము అయిన ఆ చైతన్యాన్ని ఆజ్ఞానము చేత అనిత్యమైన దృశ్యమానమైన జగత్తు నిత్యమని భావించి సంసార చక్రములో భ్రమిస్తున్నాము.

ఆహార నిద్రా భయ మైధునంచ,
సమానమేతత్ పశుభిర్నరాణాం।
బుద్ధిర్హి తేషాం అధికోవిశేషః,
బుద్ధ్యావిహీన పశుభిస్సమానః॥

అని పెద్దలంటారు. ఒక దశలో తన బుద్ధిని వినియోగించి సత్యాన్వేషణ ప్రారంభిస్తాము. అందులో భాగముగా ప్రధానముగా చింతన (1) జీవుడు; (2) జగత్తు; (3) ఈశ్వరుడు; (4) బంధము; (5) మోక్షము; (6) సాధనము అనే అంశాలపైన సాగుతుంది.

ఇలా చింతనలో ఆత్మతత్త్వాన్ని తెలుసుకునే ప్రయత్నం చేస్తాము. అయితే ఈ ఆత్మపై అసత్ అయిన అన్యమైనదంతా అధ్యారోపము చేయుటచేత అధ్యాస లేక అజ్ఞానముతో తప్పుగ అర్థం చేసుకుంటున్నామని, ఈ అధ్యాసకే ఖ్యాతి అని అంటారు. దీనికి ఖ్యాతివాదము అని పేరు. ఒకొక్క దార్శనికుడు ఒకొక్క విధముగా నిర్వచించాడు. అది ఈ క్రింది కారికలో వివరించబడినది.

ఆత్మఖ్యాతిరసత్ఖ్యాతిః,అఖ్యాతిరన్యథా ఖ్యాతి,
తథాఽనిర్వచనఖ్యాతిః ఇత్యేతత్ ఖ్యాతి పంచకం.

యోగాచార బౌద్ధులు ఆత్మఖ్యాతిగా, మాధ్యమిక బౌద్ధులు అసత్ఖ్యాతిగా, మీమాంసకులు అఖ్యాతిగా, న్యాయవైశేషికులు అన్యథా ఖ్యాతిగా దర్శించేది అద్వైతులు అనిర్వచనీయఖ్యాతిః అంటారు అందరూ అధ్యాసని అంగీకరించారు కానీ దాని విస్తృతిలోనే భేదాభిప్రాయాలు. ఆత్మ నిత్యత్వము మీద ఏ శంకా లేదు.

వేద ప్రమాణముగా కర్మమార్గమున సాధనచతుష్టయ సంపత్తి సాధించి, అంతఃకరణ శుద్ధి కలిగి ఆత్మజ్ఞానము పొందుటకు సాగుట విధానము. ఈ అధ్యయనమునకే వేదాంతము అంటారు.

దీనికి రాజమార్గము సద్గురువును ఆశ్రయించుట, వేదాంత శ్రవణము చేయుట, మననము చేయుట, నిధిధ్యాసనము సాధించుట. అత్యుత్కృష్టమైన ఈ ఆధ్యాత్మవిద్య అంత సులభము కాదు. హక్కుగా గెలుచుకునేది కాదు. అర్హత కలిగినవాడే అధికారి. అది అనేకజన్మల తపఃఫలము. అయితే నాకు ఇప్పుడు అర్హత లేదా అంటే అందరికీ ఉన్నది ముందు చెప్పుకున్న సాధనచతుష్టయ సంపత్తి సాధన కొరకు. అలా వరుసక్రమములోనే ప్రయాణించవలెనని పెద్దల మాట.

నాకు గురువుల అనుగ్రహముతో వారి బోధలు నాకు అవగతమైనంతలో ఆత్మతత్త్వమును ఈ ఉదాహరణ కావ్యములో ప్రస్తావించాను. ఇది ఇతరులకు బోధ కాదు. నాకు నేను చేసుకునే పునశ్చరణ. కాకతాళీయముగా ఇతరులకు కూడా ఉపయుక్తమౌతుందని ఆకాంక్ష. అంతా అమ్మదయ.

ఓం సహనావవతు సహనౌ భునక్తు సహవీర్యం కరవావహైః
తేజస్వినావధీతమస్తు మావిద్విషావయై,
ఓం శాంతిశ్శాంతిశ్శాంతిః



ఉదాహరణ కావ్యము తెలుగు
సాహిత్యములో ఒక ప్రత్యేక శాఖగా
పరిగణించబడి విశేషాదరణలు పొందినది.
పద్యముతో పాటుగా దేశీ ఛందస్సులో ఉండి
గానయోగ్యముగా కూడా ఉండుట దీని
ప్రత్యేకత. పరిమాణము చిన్నదైనా
వైవిధ్యములో గొప్పది.

వివిధ దేవతాత్మకములైన ఉదాహరణ
కావ్యములు ఇదివరకు వచ్చియున్నవి.
అందుకు భిన్నముగా నిర్గుణ చైతన్యమైన
ఆత్మతత్త్వము ఈ ఉదాహరణ కావ్యములోని
విశిష్టవస్తువు.